క్లుప్తంగా

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు

మొగుళ్లపల్లి: అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై శ్రీధర్ అన్నారు. గురువారం ఉదయం ఇప్పలపల్లి గ్రామ శివారులో పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఎలాంటి అనుమతులు లేకుండా పోతుగల్లు వాగు నుంచి లారీ ద్వారా ఇసుకను తరలిస్తున్న లారీ డ్రైవర్, అడప మొగిలి, ఓనర్ ఆరుకోండ శశికుమార్, జేసీబీ ఓనర్, డ్రైవర్ కూరపాటి, సదానందం, శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేసి జేసీబీ, లారీని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం



ధర్మసాగర్ : మండలంలోని మల్లక్‌పల్లి గ్రామంలోని వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ కాలేరు కరంచంద్ సోదరులు, వారి తల్లిదండ్రులు మణమ్మ–భద్రయ్య జ్ఞాపకార్థం నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిగెల రాజు, ఎంపీటీసీ బీంరెడ్డి కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

2న కొండా లక్ష్మణ్ విగ్రహావిష్కరణ



శాయంపేట : పరకాలలోని ఆర్టీసీ డిపో దగ్గర ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. ఆ కార్యక్రమ కరపత్రాలను మండల కేంద్రంలో చేనేత సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆహ్వాన కమిటీ సభ్యులు మాట్లాడారు. విగ్రహావిష్కరణకు పద్మశాలీ కులస్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మామిడి శంకర్‌లింగం, నాయకులు వంగరి సాంబయ్య, దిండిగాల రజనీకాంత్, పోరండ్ల వేణు, సాయి, అలేటి శ్రీను, పల్నాటి రాంబాబు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి



ధర్మసాగర్ : ఏప్రిల్ 3న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ దుబ్బుల కొలుపు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జునుగరి దుర్గయ్య కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాకారులు సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదని తెలిపారు. ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉచిత బీమా సదుపాయం కల్పించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం ఏప్రిల్ 3న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. ధర్నాకు మండలంలోని కళాకారులందరూ హాజరు కావాలని కోరారు. సమావేశంలో సంఘం కాగజ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు ఖామిని రాజ్‌కుమార్, మంచిర్యాల జిల్లా, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బామండ్లపెల్లి పోషం, సభ్యులు రాజు, డోకె ప్రవీణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు బోగిరి సారయ్య, సాతకారి ఎర్రయ్య, సదానందం పాల్గొన్నారు.

తండాల అభివృద్ధే ధ్యేయం

నెక్కొండ: గత ప్రభుత్వాల పట్టింపు లేని కారణంగా అభివృద్ధికి నోచుకోని గిరిజన తండాలకు మౌలిక సదుపాయాలపై దృష్టి సారించి, అభివృద్ధే ధ్యేయంగా పాటు పడుతున్నట్లు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొల్లికొండలో గురువారం రూ. 2 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే పెద్ది శంకుస్థాపన చేశారు. బొల్లికొండ గుట్టపై కొలువుదీరిన సీతారామాంజనేయ ఆలయంలో జరిగిన సీతారాముల కల్యాణాన్ని ఎమ్మెల్యే తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గుట్టపైనున్న ఆలయానికి వెళ్లే మార్గానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు బొల్లికొండ గుట్ట నుంచి నంద్య తండా వరకు నూతన బీటీ పనులను ప్రారంభించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమేశ్‌నాయక్, జెడ్పీటీసీ సరోజ, తదితరులు పాల్గొన్నారు.



తాడిచర్ల వేంకటేశ్వర ఆలయంలో..



కాటారం భక్తాంజనేయ స్వామి ఆలయంలో..



విగ్రహాలను తీసుకొస్తున్న భక్తులు



రంగాపురం గ్రామంలోని ఆలయంలో..

కల్యాణవైభోగం..

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా సీతారాముల కల్యాణం
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు



గణపురం: పాల్గొన్న ఎమ్మెల్సీ సిరికొండ



రూపిరెడ్డిపల్లిలో పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

గణపురం : గణపురం మండలంలో గురువారం శ్రీరామ నవమి సందర్భంగా పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని పట్టాభి రామచంద్ర స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ తాళ్లపెల్లి గోవర్ధన్‌లలిత దంపతులు కల్యాణ తంతులో పాల్గొనగా అర్చకులు గోవర్ధన దుర్వాసాచార్యులు, గోవర్ధన వేణుగోపాలచార్యులు, గోవర్ధన శ్రీనివాసులచార్యులు కన్నుల పండుగగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి పాల్గొన్నారు. బుద్ధారంలోని శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త, కాంగ్రెస్‌పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారయణరావు పద్మ దంపతులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు మండలంలోని వెలిశాల, రామకిష్టాపూర్, దుబ్యాల, తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, ఎస్సై చల్ల రాజు, సర్పంచ్, ఎంపీటీసీలు పాలాల సరోత్తం రెడ్డి, ఆది సునీతరఘు, బిల్లకంటి ఉమేందర్‌రావు, సంగి రవి, చింతలపెల్లి విజయాస్వామిరావు, అడగాని రామారావు పాల్గొన్నారు.

రేగొండలో..

రేగొండ మండల కేంద్రంలోని రాయపల్లి, రూపిరెడ్డిపల్లి, గోరికొత్తపల్లిలో శ్రీరామ నవమి వేడుకలను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు.



టేకుమట్లలో..

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ నేత గండ్ర సత్యనారాయణరావు, బీజేపీ నేత చందుపట్ల కీర్తిరెడ్డి, సర్పంచ్ బండారి కవితాదేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండంలోని నల్లగుంట మీనాజీపేటలోని రంగనాథస్వామి ఆలయంతోపాటు నర్సింగాపూర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో సీతారామ కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కనులపండువగా..

మల్హర్: మండలంలోని తాడిచర్ల వెంకటేశ్వర ఆలయం, ఎడ్లపల్లి షిరిడిసాయిబాబా మందిరంలో గురువారం శ్రీరామనవమి వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని వీక్షించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదానం చేశారు.

కాటారం: మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయంతో పాటు కాటారం భక్తాంజనేయ స్వామి ఆలయం, బొప్పారం సీతారామచంద్ర స్వామి ఆలయంలో గురువారం శ్రీరామనవమి వేడుకలు కన్నులవిందుగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, సర్పంచ్ తోట రాధమ్మ, ఎంపీటీసీ జాడి మహేశ్వరీ, బచ్చు అశోక్‌గుప్త బొప్పారం ఆలయ వ్యవస్థాపకులు ఊర సుసన్, నందకిశోర్, జయచైతన్య, నందగోపాల్, ఆలయ పురోహితులు మాడుగుల నాగరాజుశర్మ, నిఖిల్‌శాస్త్రి, సురేశ్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



చింతలపల్లిలో మహా అన్నదానం

చిట్యాల: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం శ్రీరామ నవమి వేడుకలు అంగ రంగ వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల సాక్షిగా సీతారాముల కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు నైన్‌పాక, జడల్‌పేట, ఒడితల, నవాబుపేట, తిరుమలాపూర్, గుంటూరుపల్లి, జూకల్, చల్లగరిగ తదితర గ్రామాల్లో నవమి వేడుకలను జరిపించారు. మండలంలోని గుంటూరుపల్లి గ్రామంలో జరిగిన కల్యాణ వేడుకలకు సీఐ సతీమణి దాసారపు నిఖిల వేణు చందర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాశం శంకర్ సామ్రాజ్యం దంపతులు ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చల్లగరిగలో ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, నైన్ పాకలో జెడ్పీటీసీ గొర్రె సాగర్, గుంటూరుపల్లిలో సర్పంచ్ రాణి వెంకన్న, నవాబుపేటలో సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధా రత్నాకర్ రెడ్డి, జడల్‌పేటలో కామెడీ రత్నాకర్ రెడ్డి, కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. వెంకట్రావుపల్లి (సీ) చింతలపల్లిలో కల్యాణం జరిపించారు.



మహాముత్తారం: నర్సింగాపూర్‌లో..

మొగుళ్లపల్లి: మండంలోని రంగాపురం, మొగుళ్లపల్లి, పోతుగల్లు, పిడిసిల్ల, వేములపల్లి, ఇస్సిపేట గ్రామాల్లో గురువారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగాపురంలోని శ్రీసితారామ చంద్రస్వామి ఆలయంలో జరిగిన సీతారాముల కల్యాణంలో సర్పంచ్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, మొగుళ్లపల్లిలో సర్పంచ్ మోటె ధర్మారావు పాల్గొన్నారు.



గుంటూరుపల్లిలో..

వేంకటేశ్వర స్వామి ఆయలంలో..



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్లు పుట్ట మధుకర్, జక్కు శ్రీహర్షిణి

మహదేవపూర్: మండల కేంద్రంలోని శ్రీమందరగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో సీతారామ స్వామి కల్యాణ మహోత్సవం రంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి కాలేశ్వరం దేవాలయం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు సమర్పించారు. మండలంతో పాటు కాటారం, మహాముత్తారం, పలిమెల, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని పూజారి నవీనాచార్యులు ఆధ్వర్యంలో పాల్గొని కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి, పెద్దపెల్లి జెడ్పీ చైర్ పర్సన్లు జక్కు శ్రీహర్షిణి, పుట్ట మధుకర్, బీజేపీ ఇన్‌చార్జ్ చందుపట్ల సునీల్ రెడ్డి, కాలేశ్వరం దేవస్థానం చైర్మన్ శ్రీనివాసరావు, కాటారం మాజీ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఆన్‌కార్ భవాని ప్రకాష్, ఎంపీపీ రాణి బాయ్, జెడ్పీటీసీ అరుణ, ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, ధర్మకర్తలు శీలం గట్టయ్య, రామచంద్రం పాల్గొన్నారు.



కాళేశ్వరం:కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయం శ్రీరామాలయంలో శ్రీసీతారామచంద్ర స్వామి ఉత్సవ మూర్తులకు కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆనావాయితీ ప్రకారం కాళేశ్వరాలయం నుంచి దేవస్థానం చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు, ఈఓ మహేష్ పట్టువస్త్రాలు, తలంబ్రాలను స్వామివారికి సమర్పించారు. అనంతరం వేదపండితులు కల్యాణ తంతును నిర్వహించారు. సర్పంచ్ వసంత, ఎంపీటీసీ మమత, దర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి, దేవేందర్, పద్మ, ప్రశాంత్‌రెడ్డి, సత్యనారాయణ, రాజయ్య, దేవుడా శ్యాంసుందర్, దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మాధవి, గంట రాంనారాయణగౌడ్, ఎస్సై లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

మిర్చి, మొక్కజొన్న పంటల సర్వే



వివరాలు సేకరిస్తున్న అధికారులు

చిట్యాల: ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న మిర్చి, మొక్కజొన్న పంటలను హార్టికల్చర్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టారు. మండలంలోని బావుసింగ్‌పల్లి, కైలాపూర్, చింతకుంటరామయ్యపల్లి, తిరుమలాపూర్ గ్రామాల్లో హార్టికల్చరల్ అధికారి సునీల్ ఆధ్వర్యంలో ఐదుగురు ఏఈఓలు పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించారు. బావుసింగ్‌పల్లి సర్పంచ్ దామరబోయిన నారాయణరావు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన ఉద్యానవన శాఖ జిల్లా అధికారులు సంజీవ రావు, హెచ్ఓ సునీల్ ఏఈఓ సుమంత్ మిర్చి పంటలను పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తామని అన్నారు. అలాగే రెండు రోజుల్లో గ్రామంలో వడగండ్ల వానతో నష్టపోయిన మిర్చి రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు చిర్ర సన్ని, రమణకుమార్, సందీప్, ఉప సర్పంచ్ కిరణ్, రైతులు పాల్గొన్నారు.

వివేకానందలో వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కాటారం: కాటారం మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో బుధవారం రాత్రి నిర్వహించిన 30వ వార్షికోత్సవ వేడుకలు అలరించాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థానంలో నిలవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు ఏకాగ్రత, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వలుస వెంకటేశ్వర్లు, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, సీఐ రంజిత్‌రావు, ప్రిన్సిపాల్ వలుస వందన, ట్రస్మా నాయకులు సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు విద్య, వైద్యం ప్రభుత్వ బాధ్యత



మాట్లాడుతున్న సిద్ధార్థ

ఆత్మకూరు : పేదలకు విద్య, వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఉచిత విద్య, వైద్యం సాధన సమితి జాతీయ అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ స్పష్టం చేశారు. గతేడాది నవంబర్ 5న మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌లో ప్రారంభమైన చైతన్య యాత్ర మండల కేంద్రానికి గురువారం చేరుకుంది. ఈ సందర్భంగా సిద్ధార్థ ఆధ్వర్యంలోని బృందం ఎస్సీ, బీసీ హాస్టళ్లను సందర్శించి వసతులను పరిశీలించింది. అలాగే సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లను సందర్శించి సమస్యలపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని పలు హాస్టళ్లలో విద్యార్థులకు సరైన సదుపాయాలు లేవని ఆందోళన వెలిబుచ్చారు. పేదలు ఎక్కువగా హాస్టళ్లలో ఉండి చదువుకుంటారని చెప్పారు. ఈ క్రమంలో హాస్టళ్లలో సరైన వసతులు కల్పించడంతోపాటు ఉచితంగా విద్య, వైద్యం అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీదే ఉందన్నారు. ఇప్పటికైనా అన్ని హాస్టళ్లలోనూ విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాధన సమితి ఉత్తర తెలంగాణ ఇన్‌చార్జ్ నమిండ్ల కరుణాకర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాస్

కాటారం: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కాటారం ఎస్సై చంద్రగిరి శ్రీనివాస్ అన్నారు. కాటారం మండల కేంద్రంలోని కేజీబీవీ, టీటీడబ్ల్యూఆర్ బాలికలు, బాలుర పాఠశాలల్లో గురువారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థినులు సోషల్ మీడియాకు ఆకర్షితులు కావొద్దని విద్యాసంబంధిత అంశాలకు మాత్రమే సెల్‌ఫోన్‌లు వినియోగించుకోవాలని సూచించారు. సోషల్‌మీడియాలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు, స్నేహాలు చేయొద్దని చెప్పారు. విద్యార్థినులు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే 1930 నంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. షీ టీం సేవలను వినియోగించుకోవాలని అన్నారు. ర్యాగింగ్ లాంటి వాటికి పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు లక్ష్మిరాజ్, సతీశ్, స్వాతి, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టేకుమట్ల(రేగొండ): సైబర్ నేరాలపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీలత అన్నారు. గురువారం రేగొండ మండలంలోని భాగిర్థిపేట, చిట్యాల కస్తూర్బా బాలికా విద్యాలయంలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఇద్దరిని సైబర్ అంబాసిడర్‌గా ఎన్నుకుని వారికి సైబర్ నేరాలపై శిక్షణ అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బాలికలు సోషల్ మీడియాలో వచ్చే పోస్టులకు సమాధానాలు ఇవ్వకూడదని, ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో గుర్తు తెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్తమ విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. బాలికల రక్షణ కోసం షీ టీంలు అండగా ఉన్నాయని, అత్యవసర సమయంలో పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే సైబర్ సేఫ్టీ ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ కానిస్టేబుళ్లు దేవేంద్ర, రసమయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

'వర్గీకరణ' చేయకుంటే బుద్ధి చెబుతాం



మాట్లాడుతున్న గంగారపు శ్రీనివాస్

ధర్మసాగర్ : తక్షణమే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించకుంటే రానున్న ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీకి గుణపాఠం తప్పదని ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గంగారపు శ్రీనివాస్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి గంగారపు శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడచినా బీజేపీ పెద్దలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి సరైన మెజార్టీ ఉన్నా వర్గీకరణ బిల్లుకు ఎందుకు చట్టబద్ధత కల్పించడం లేదని ప్రశ్నించారు. ఇకనైనా వెంటనే పార్లమెంటులో వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశాడు. లేనిపక్షంలో రానున్న అన్ని ఎన్నికల్లోనూ మాదిగ, ఉపకులాల ప్రజలు బీజేపీకి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈనెల 31న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు శాంతిసాగర్, సురుగూరి కమలాకర్, కొట్టె కళ్యాణ్, నీలం మహేందర్, చిలుక రాజు, మాచర్ల బాబు, ఖాజా, ఏనుట్ల రాజ్‌కుమార్, చిట్యాల పద్మారావు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆదివాసీ నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారంలోని కొమురంభీం కాలనీలో ఆదివాసీ తెగల సమ్మేళనం పోస్టర్‌ను ఆ సంఘం సమన్వయకర్త చుంచు రామకృష్ణ ఆవిష్కరించారు. గురువారం ఆయన మాట్లాడుతు... ఏప్రిల్ 7, 8 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించే సమ్మేళనానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు మడే కుమార్, అన్నారం ఉప సర్పంచ్ దూనే సమ్మయ్య, కొడిపే బాపు, బాపు, పోచయ్య, సమ్మయ్య, చీడం మారక్కలు పాల్గొన్నారు.